క్లుప్తంగా

కోలాహలంగా విగ్రహాల ఊరేగింపు



బీరప్ప విగ్రహాల ఊరేగింపు

మోమిన్‌పేట: మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో బుధవారం బీరప్ప విగ్రహాల ఊరేగింపు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నూతన విగ్రహాలను భాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు.

సత్తా చాటిన సత్తయ్య



సత్తయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ఇటీవల హర్యానాలోని కురుక్షేత్రంలో జరిగిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్-2023లో వికారాబాద్ మండలం గోధుమగూడకు చెందిన సత్తయ్య 5 కి.మీ. వాకింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తన క్యాంపు కార్యాలయంలో సత్తయ్యను ఘనంగా సన్మానించారు. ఇతను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నారు.

త్వరలో ఆలయ నిర్మాణం

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయాన్ని త్వరగా పూర్తి చేయాలని స్వామి భక్తులు నిర్ణయించారు. ఈ మేరకు దాతలు, కమిటీ సభ్యులు బుధవారం తీర్మానించారు. అయ్యప్ప సేవా సమితీ సభ్యుల సహకారం ఎంతో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ కార్యాలయం, గోదాము భవనాన్ని ప్రారంభించారు. వాస్తు పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీసీరోడ్ల పనులు పూర్తి చేయాలి

ఎంపీడీఓ సత్తయ్య

అనంతగిరి: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరయిన సీసీరోడ్ల పనులను వెంటనే పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్ఏలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో 100మంది చొప్పున ఉపాధిహామీ కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. తప్పనిసరిగా అటెండెన్స్ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి జీపీకి రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టులో రోడ్డు పని చేయించాలన్నారు. నర్సరీలో మొక్కలు చక్కగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నిండుగా ఉండేలా, ఏపుగా పెరిగేటట్లు చొరవ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శీను, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

- లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్

షాబాద్: నిరుపేద మహిళలకు ఉచితంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షాబాద్, కుమ్మరిగూడ, నరెడ్లగూడ గ్రామాలకు చెందిన ఐదు మంది లబ్ధిదారులకు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు కుట్టుమిషన్లు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సభ్యులు మల్లేశ్, మల్లికార్జున్, షిఫీ, అడ్డు, సుధీర్ తదితరులున్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

దోమ: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించాలని మండల ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. బుధవారం మోత్కూరు పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి అనేది ఎంతో కీలకమైందని చెప్పారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాగు ఘనం.. ఆదాయం తక్కువ

- పెరుగుతున్న చెరుకు పంట
- కర్మాగారాలు లేక రైతుల ఇక్కట్లు
- దళారుల చేతిలో దగా పడుతున్న వైనం..
- సబ్సిడీపై విత్తనాలు అందజేయాలంటున్న రైతులు



చెరుకు సాగు చేస్తున్న రైతులు (ఫైల్)

పెద్దేముల్: చెరుకు సాగు మండలంలో క్రమంగా పెరుగుతోంది. పంటకు అనువైన నేలలు ఉండటంతో చెరుకు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ 30ఏళ్లుగా చెరుకు కర్మాగారం కోసం ఎదురు చూస్తున్నా.. కర్షకుల కల నెరవేరటం లేదు. దీంతో రైతుకు తీపిని పంచాల్సిన చెరుకు ఏటా చేదును మిగుల్చుతోంది. ఏడాది పాటు చేసిన కష్టార్జితం చివరకు దళారుల పాలవుతోంది. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నా.. మద్దతు ధర లేదని, కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రోటపల్లి, పెద్దేముల్, బంట్వారం, మర్పల్లి, ధారూర్, యాలాల, తాండూరుతో పాటు పలు మండలాల రైతులు చెరుకును సాగుచేస్తున్నారు. రెండేళ్లుగా భారీ వర్షాలకు పంటలు పాడవటంతో ఈసారైనా దిగుబడి పెంచుకొని రాబడి పొందేందుకు రైతులు ఉత్సాహం కనబరుస్తున్నారు.

ఎకరా సాగుకు రూ.50 వేలు

15 ఏళ్ల క్రితం సుమారు 20నుంచి 25వేల ఎకరాల వరకు జిల్లాలో చెరుకు సాగు ఉండేది. ఫ్యాక్టరీలు అందుబాటులో లేక, ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించక పోవటం, కూలీల కొరత ఏర్పడటంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అప్పట్లో పండించిన చెరుకును సంగారెడ్డిల్లోని గణేశ్ ఫ్యాక్టరీ, మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తకోట, కర్ణాటక రాష్ట్రంలో యాద్గిరి ప్రాంతాల కర్మాగారాల యజమానులు కూలీలు, యంత్రాలను పంపించి చెరుకు కోతలు జరిపించేవారు. నాలుగేళ్లుగా వారు పట్టించుకోక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. అప్పట్లో టన్ను చెరుకు కోతకు కూలీలకు రూ.400 ఉండేది. ప్రస్తుతం రూ.650 పెరిగింది. ఏటా ఖర్చులు పెరుగుతున్నా.. మద్దతు ధర దక్కటం లేదని కర్షకులు వాపోతున్నారు. ప్రస్తుతం టన్నుకు ట్రాన్స్‌పోర్ట్, లేబర్ ఖర్చులు పోను ఫ్యాక్టరీ నుంచి సుమారు రూ.2,300ల వరకు వస్తుందని, కనీసం టన్నుకు ప్రభుత్వం రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు మద్దతు ధర ఇస్తే కొంచెం లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎరువుల ధరలు పెరగటంతో ఎకరా సాగుకు రూ.40నుంచి రూ.50వేలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం యాబై శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కర్మాగారం ఏర్పాటు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో చెరుకు కర్మాగారం ఏర్పాటు చేసి రైతుల కల నెరవేర్చాలి. ఫ్యాక్టరీ లేక 30 ఏళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఫ్యాక్టరీలు అందుబాటులో లేక తక్కువ ధరలకు చెరుకు విక్రయిస్తున్నారు. పెట్టుబడులు కోల్పోతున్నారు.

– ముకుందురెడ్డి, రైతు, జనగాం

దళారీ వ్యవస్థను అరికట్టాలి



ఫ్యాక్టరీల యజమానులు రైతుల నుంచి నేరుగా చెరుకు ఖరీదు చేయాలి. అవసరం ఉన్నంత వరకు కూలీలను ఏర్పాటు చేయాలి. దళారీ వ్యవస్థను రూపుమాపాలి. అప్పుడే రైతుకు లాభం. ఫ్యాక్టరీల యాజమాన్యం కూలీలను ఏర్పాటు చేయకపోవటంతో రైతులను దళారులు దోచుకుంటున్నారు. టన్నుకు రూ.250 నుంచి రూ.300ల వరకు తగ్గిస్తున్నారు. ఇదేమని అడిగితే కూలీలను తీసుకొచ్చామంటున్నారు.

–రాంరెడ్డి, రైతు, గిర్మాపూర్

విద్యావ్యవస్థ ఉన్నతికి పీఆర్టీయూ కృషి



ఆశ్రమ పాఠశాలలో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నేతలు

- ఎమ్మెల్సీగా చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయ సంఘం నేతలు

కుల్కచర్ల: పీఆర్టీయూటీఎస్ బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ నేనని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడడంతో పాటు.. విద్యావ్యవస్థ ఉన్నతికి సంఘం కృషిచేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో పెద్ద సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, రాంపూర్ ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి సబితారాణి, సంఘం నాయకులు వెంకటయ్య, హన్మయ్య, తిరుపతిరెడ్డి, రవీందర్ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కుల్కచర్ల: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జనాభ పరంగా అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ముదిరాజ్‌లు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని, అదే విధంగా తోటి వారికి తోడ్పాటునందిస్తూ వారి ఉన్నతికి పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, సంఘం నాయకులు కాటనిపల్లి ఆంజనేయులు, బీఎస్ ఆంజనేయులు, రఘు, శ్రీనివాస్, లక్ష్మణ్, ఆనందం, గాదె మైపాల్, కాటనిపల్లి మైపాల్, గుడాల వెంకటయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ

వికారాబాద్ అర్బన్: జిల్లాలో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ఉచితంగా మందు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రెండో విడత నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 56 బృందాలు గ్రామాలకు వెళ్లి నట్టల మందును పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 2,54,581 గొర్రెలు, 2,59,534 మేకలు ఉన్నాయని, వీటన్నింటికీ నట్టల నివారణ మందు తాగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మందు తాగించడంతో గొర్రెలు, మేకల్లో ఎదుగుదల పెరుగుతుందని, పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనిల్ కుమార్ సూచించారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కొడంగల్: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు పున్నం చంద్ లాహోటీ అన్నారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



బీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. బుధవారం దిర్సంపల్లిలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఈడ్గి మధుసూదన్, యాదయ్య అనే కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందారు. మృతులకు పార్టీ సభ్యత్వాలు ఉండడంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షల బీమా చెక్కులను పార్టీ మంజూరు చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి కార్యకర్తల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యకర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే పార్టీ బీమా పాలసీ ద్వారా రూ.2 లక్షలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాష, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితీ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, సర్పంచులు యాదయ్యసాగర్, కవిత, నాయకులు వెంకట్‌రాములు, హైమద్, మైను పాల్గొన్నారు.

నాటిన మొక్కలను రక్షించాలి

మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్ చంద్ర

వికారాబాద్ అర్బన్: హరితహారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. బుధవారం హరితహారంపై కౌన్సిల్ హాలులో మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. అవెన్యూ ప్లాంటేషన్, పట్టణ ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, నగర వనాలు, నర్సరీలు, పార్కుల నిర్వహణ బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. వీటి బాధ్యత ఎవరికి ఉంటే వారే అన్నివిధాల చూసుకోవాలన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే ఉన్నతాధికారుల చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటిన మొక్కలకు రోజు నీరు పోయించాలని, పశువులు తినకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

ఏఐసీసీ సభ్యుడు రమేష్‌కు సన్మానం



రమేష్ మహరాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: ఏఐసీసీ కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్‌ను బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీకి ప్రజాధరణ ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ మధుబాల, కౌన్సిలర్ మమత నాగరాజ్, మాజీ వైస్ చైర్మన్ అలీం, మాజీ కౌన్సిలర్లు బస్వరాజ్, మల్లికార్జున్, లింగదల్లి రవి, నాయకులు హబీబ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిన బస్సు

డొక్కు సర్వీసులను తొలగించాలన్న ప్రయాణికులు



తాండూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

ధారూరు: ధారూరు నుంచి తాండూర్‌కు బయలుదేరిన ఆర్టీసీ ఆర్డినరి బస్సు బుధవారం మధ్యాహ్నం 3.50 గంటల ప్రాంతంలో ఎస్‌బీఐ బ్యాంకు సమీపాన సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు దిగి.. మరో బస్సుకోసం గంటల తరబడి వేచి చూశారు. అక్కడ ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలపకపోవడం, ఆర్డినరి బస్సు రాకకోసం నిరీక్షించాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోయారు. డొక్కు బస్సుల్లో ఎక్కిన దగ్గర నుంచి దిగేవరకు ఎక్కడ ఆగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇలా కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్టీసీ సంస్థ డొక్కు బస్సులను తొలగించి.. కొత్త సర్వీసులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

విశేష కృషికి.. జాతీయ గుర్తింపు

నేషనల్ అవార్డుకు ఎంపికైన రమేష్‌బాబు



అవార్డు ఆహ్వాన పత్రికను అందుకుంటున్న రమేష్‌బాబు

కొడంగల్ రూరల్: బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో 2023వ ఏడాదికి గాను అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు పట్టణానికి చెందిన యు. రమేష్‌బాబు ఎంపికయ్యారు. అక్షరం, ఆరోగ్యం ఆర్థిక రంగాలకు గాను గ్రామీణ ప్రాంతాల్లో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు వరించిందని రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఆహ్వాన పత్రాన్ని అందుకున్నట్లు ఆయన చెప్పారు. మార్చి 12వ తేదీన తిరుపతిలో జరిగే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఏ తెలంగాణ అధ్యక్షుడు గౌతం మల్లేశ్, స్వేరో సర్కిల్ జిల్లా అధికార ప్రతినిధి ఎరన్‌పల్లి శ్రీనివాస్, హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా నాయకుడు రఫీ, భీమ్‌రాజ్, వెంకటరాములు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ సమన్యాయం

న్యాయమూర్తి హరికుమార్



సబ్ జైలులో ఖైదీలకు సూచనలు ఇస్తున్న న్యాయమూర్తి హరికుమార్

పరిగి: పేద, ధనిక తేడా లేకుండా అందరికీ సమన్యాయం అందించాలన్నదే భారత న్యాయవ్యవస్థ ఉద్దేశమని పరిగి కోర్టు న్యాయమూర్తి హరికుమార్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్, జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ బీబీ శీతల్ ఆదేశానుసారం బుధవారం పరిగి సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అధికారులు సందర్శించి.. ఖైదీల ఆరోగ్యం, వారికి అందజేస్తున్న ఆహారం, మౌలిక సదుపాయాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా తమపై ఉన్న కేసుల గురించి కోర్టులో వాదించేందుకు ఆర్థికంగా ఇబ్బంది ఉండి.. లాయర్లను పెట్టుకోలేని పక్షంలో జిల్లా లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో న్యాయపరమైన సలహాలు ఇవ్వడం, లాయర్లు వారి తరపున కోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నింధితులు ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది ఉండి, న్యాయపరమైన సహాయం కావాలంటే తమదృష్టికి తీసుకరావాలని వెల్లడించారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- మండల విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థినిని దృష్టిలో ఉంచుకొని విద్యనందించాలని, పది పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చదవులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మనఊరు-మనబడి కింది ఎంపికైన పాఠశాలలో పనుల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పనుల తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అన్ని పనులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుని, విద్యార్థులకు మంచి వాతావరణంలో విద్యనందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో గొప్పది అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తనయకుడు దినేష్‌రెడ్డి

చేవెళ్ల: అన్నిదానల్లో కెల్లా అన్నదానం గొప్పదని యువ నాయకుడు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు పట్నం దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు.మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద శివరాత్రి జాతర భక్తుల కోసం చేవెళ్లకు చెందిన దాతలు మద్దెల జంగయ్య, తలారి యాదయ్యలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం వారు ప్రారంభించారు. జాతరకు వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలకోసం అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ప్రజల అకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఇలాంటి కార్యక్రమంలో ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ బండారు శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు రమణారెడ్డి, ఆగిరెడ్డి, యాదగిరి, మానిక్యరెడ్డి, బేగరి నర్సింలు, మానిక్యం, రాంరెడ్డి, ప్రభు,శంకరయ్య, దయాకర్ ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబ సభ్యులను పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



ఘటనా వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

యాలాల: మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన బాలికపై ఇటీవల లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. బుధవారం తాండూరు ఏఎంసీ చైర్మన్ విఠల్ నాయక్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైంగిక దాడి ఘటన వెలుగులోకి వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా.. బాధిత కుటుంబాన్ని అధికారులు కానీ, ట్రైబల్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి ధైర్యం చెప్పే సాహసం చేయలేదని మండిపడ్డారు. గిరిజనులను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని విమర్శించారు. బాలిక పట్ల అమానుషంగా ప్రవర్తించిన పేర్కంపల్లివాసి బీజే రఘుపతిని కఠినంగా శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. 'దిశ' కేసులా ఈ బాలిక కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానని, బాలిక ఉన్నత చదువులు చదువుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కాగా ఈ అత్యాచార ఘటనలో కేవలం హెచ్ఎంను సస్పెన్షన్ చేసి, మిగితా వారిని వదిలిపెట్టడం సరికాదన్నారు. పిక్నిక్‌కు తీసుకెళ్లిన మిగితా ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

28న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

బాలిక పట్ల అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 28న తాండూరు ఆర్డీఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.కోటి నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎస్పీ కోటిరెడ్డి, తాండూరు ఆర్డీఓ అశోక్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భవిష్యత్‌లో బాధిత కుటుంబానికి, నిందితుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి హానీ కలగకుండా చూసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బంజార నాయకులు భానుపవార్, అనిల్ రాథోడ్, ప్రేమ్, దినేష్, శివ తదితరులు ఉన్నారు.